

నిత్యాన్నదానానికి విరాళం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్ర కీలాద్రిపై నిత్యాన్నదానానికి అనంతపురం జిల్లా రుద్రంపేటకు చెందిన వి.నందిని మంగళవారం రూ.1.60 లక్షలు విరాళంగా అందజేశారు.



ఆత్మీయ కలయిక

చిలకలపూడి : అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ జీఎన్ఎస్ మూర్తి ని మంగళవారం కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ కలిసి మొక్కను అందజేశారు.

ఆర్థిక సంఘం కమిషన్ బృందానికి స్వాగతం



గన్నవరం: 16వ ఆర్థిక సంఘం కమిషన్ చైర్మన్ అరవింద్ పనగరియా నేతృత్వంలో బృందం మంగళవారం రాత్రి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. వారికి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్వాగతం పలికారు.

న్యూస్‌రీల్

మహిళలకు ఉల్లాస్ కార్యక్రమం అమలు చేయాలి

డీఆర్వో చంద్రశేఖరరావు



చిలకలపూడి(మచిలీపట్నం): నూరుశాతం అక్షరాస్యత సాధించే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమాన్ని జిల్లాలో నిరక్షరాస్యులైన మహిళలకు అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు అన్నారు. కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లో లబ్ధిదారులు, ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలు, వంట వారు, హెల్పర్లు, పారిశుద్ధ్య కార్మికులు కొంత చదువు కలిగిన వారు మర్చిపోయినప్పటికీ ఈ కార్యక్రమం ద్వారా లబ్ధిదారులుగా గుర్తించి అక్షరాస్యత కల్పించటమే ఉల్లాస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. మహిళలకు క్రియాత్మక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత సాధించటంపై దృష్టి సారించి ఈ కార్యక్రమాన్ని వినూత్నంగా అమలు చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, డీపీవో జె.అరుణ, ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, డీఈవో పీవీజే రామారావు, వయోజన విద్య ఉప సంచాలకుడు హాజీబేగ్ పాల్గొన్నారు.

కృష్ణాజిల్లాలో 228 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

జేసీ గీతాంజలిశర్మ



చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో ఖరీఫ్ మిగులు ధాన్యం, రబీ పంటకు సంబంధించి రైతుల వద్ద నుంచి ధాన్యం సేకరించేందుకు జిల్లాలో 228 ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ మంగళవారం తెలిపారు. రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన గోనెసంచులు రైస్‌మిల్లుల వద్ద అందుబాటులో ఉంచామన్నారు. జిల్లాలో 128 రైస్ మిల్లులకు ధాన్యం సేకరణకు అనుమతులు మంజూరు చేశామన్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేని కారణంగా ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా టార్పాలిన్లు అందుబాటులో ఉంచామన్నారు. జిల్లాలోని రైతులందరూ తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యత, ప్రమాణాల ప్రకారం సంబంధిత రైతు సేవా కేంద్రాల ద్వారా విక్రయించుకుని కనీస మద్దతు ధర పొందాలని కోరారు.

విద్యుత్ ప్రైవేటీకరణ విధానాలు ఉపసంహరించుకోవాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ ప్రైవేటీకరణ విధానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని, అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోవాలని, స్మార్ట్‌మీటర్లు బిగించడాన్ని నిలిపివేయాలని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగించి కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. విజయవాడ గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో మంగళవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.వి.నాగేశ్వరరావు మాట్లాడుతూ గతంలో జమ్మూకాశ్మీర్‌లో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాడి వెనక్కి కొట్టారని, ఇప్పుడు చండీఘర్‌తో పాటు, యూపీ, తెలంగాణ, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సమ్మె చేపట్టనున్నారని తెలిపారు. స్మార్ట్ మీటర్లు పెడితే వాటిని పగలగొట్టాలని గతంలో లోకేష్ పిలుపునిచ్చారని, మరిప్పుడు వాడవాడలా బిగిస్తుంటే వాటిపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. సమావేశంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.సుదర్శనరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.సత్యన్నారాయణ, ఎంసీహెచ్ వీరాంజనేయులు, నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మకు బంగారు నక్లెస్ బహూకరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారికి లండన్‌లో స్థిరపడిన తెలుగు కుటుంబానికి చెందిన వి.సీతారామిరెడ్డి పేరుతో ఆయన కుటుంబసభ్యులు 30.500 మి.గ్రా. బంగారు నక్లెస్‌ను బహూకరించారు. మంగళవారం శ్రీదుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానానికి విచ్చేసిన వారు ఆలయ అధికారికి నక్లెస్‌ను అందజేశారు. దాత కుటుంబసభ్యులకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.

● పవిత్ర సంగమం పట్టించుకునే నాథుడేడి?





విజయవాడ ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద సందర్శకుల తాకిడి లేక వెలవెలబోతున్న పవిత్ర సంగమం ఘాట్.., (ఇన్‌సెట్‌లో) మూతపడిన టూరిజం కౌంటర్, వీధి దీపపు స్తంభంపై పక్షి గూళ్లు

ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద పవిత్ర సంగమానికి పూర్వ వైభవం తెస్తాం... అంటూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు కురిపించిన వాగ్దానాల నీటి మూటలు కృష్ణమ్మలో కలిసిపోయాయి. అధికారంలోకి వచ్చి పది నెలలైనా ఫెర్రీ ఘాట్ గురించి పట్టించుకున్న నాథుడే లేడు. ఫెర్రీ కి వెళ్లే రహదారిని చూస్తే ఇక్కడ ఏదన్నా భూకంపం వచ్చిందా అన్నట్టు ఉంది. పవిత్ర సంగమంలో వీధి దీపపు స్తంభంపై పిచ్చుక గూళ్లు పెట్టాయంటే ఇక్కడ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ ప్రదేశం ఆకతాయిలకు అడ్డాగా మారిపోయింది. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఫెర్రీ ఘాట్ సందర్శకులు లేక వెలవెలబోతోంది. సందర్శకులు రాకపోవడంతో టూరిజం కౌంటర్ మూతపడింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ఫెర్రీ నుంచి పవిత్రసంగమం వైపు వెళ్లే రహదారి దుస్థితి ఇది

అమరావతి రాజధాని అభివృద్ధి పేరుతో కూటమి ప్రభుత్వం మరోసారి పేదల భూమికి ఎసరు పెడుతోంది. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం జూపూడి, చిన లంక, గుంటూరు జిల్లా పరిధిలోని పెదలంక గ్రామాల్లో పేదలు సాగుచేసుకుంటున్న సుమారు 2వేల ఎకరాల లంక భూములు స్పోర్ట్స్ క్లబ్ పేరుతో తీసుకునేందుకు కుట్ర పన్నింది. ఇందులో భాగంగా పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, కలెక్టర్ లక్ష్మీశ, ఇతర ఎమ్మెల్యేలు సోమవారం లంక భూములు పరిశీలించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం లంక భూములు సాగుచేసుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు పట్టాలు ఇచ్చి ఆ భూములపై హక్కు కల్పించింది. కూటమి ప్రభుత్వం ఆ భూములకు చుక్కలు పెట్టి నిషేధిత జాబితాలో చేర్చి పేదలకు అన్యాయం చేసింది. తాజాగా ఆ భూములనే లాక్కునేందుకు రంగం సిద్ధం చేస్తోంది.

చినలంక గ్రామంలో సాగులో ఉన్న చెరకుతోట



అమరావతి పేరుతో
పేదల భూములకు టెండర్

- వ్యవసాయం జీవనాధారంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు
- బ్రిటీష్ కాలం నుంచి సాగు చేసుకుంటున్న పేదలు
- పట్టాలతో హక్కులు కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- చుక్కలు పెట్టి నిషేధిత జాబితాలో చేర్చిన కూటమి ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఇబ్రహీంపట్నం మండలంలో జూపూడి, ఇబ్రహీంపట్నం, మూలపాడు, కొటికలపూడి, త్రిలోచనాపురం, కేతనకొండ గ్రామాల పరిధిలో దాదాపు 1800 ఎకరాల లంక భూముల్లో బ్రిటీష్ కాలం నుంచి పూర్వీకులు వ్యవసాయం చేసి తమ కుటుంబాలను పోషించుకునేవారు. 1940–42 మధ్య కాలంలో అప్పటి మద్రాస్ ప్రభుత్వంలో సొసైటీలుగా ఏర్పడి 2013 వరకు శిస్తులు చెల్లించారు. ఆ తర్వాత కాలంలో రైతుల నుంచి శిస్తులు కట్టించుకోకుండా లీజులు

స్పోర్ట్స్ క్లబ్ పేరుతో 2వేల ఎకరాల లంక భూముల స్వాహాకు యత్నం

ఇవ్వడం నిలిపేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం కూడా లీజు ఆర్డర్లు ఇవ్వకుండా సన్నచిన్నకారు రైతులకు మొండిచేయి చూపించింది. పేదల పట్ల చిన్నచూపుతో వ్యవహరించింది.

పేదలకు హక్కు కల్పించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

బ్రిటీష్ ప్రభుత్వం నుంచి సుమారు 80 ఏళ్లుగా లంక భూములు సాగుచేసుకుంటున్న పేదలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం న్యాయం చేసింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లంక భూములు సాగుచేసుకుంటున్న పేదలకు సంపూర్ణ హక్కులు కల్పించారు. కనీసం శిస్తులు కూడా కట్టించుకోని పరిస్థితుల్లో భూములపై ఎటువంటి హక్కులేని పేదలకు వ్యక్తిగతంగా అసైన్డు/డీకేటీ పట్టాలు పంపిణీ చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలోని 5 గ్రామాల్లో 1209 మంది రైతులకు సంబంధించి 765.07 ఎకరాలు, కంచికచర్ల మండలంలో 6 గ్రామాలకు సంబంధించి



చినలంకలో సాయిల్ టెస్ట్ చేస్తున్న సీఆర్డీఏ సిబ్బంది

120 మంది రైతులకు 88.56 ఎకరాలు, మొత్తం 1329 మంది రైతులకు సంబంధించి 11 గ్రామాల్లో 853.63 ఎకరాల లంక భూములకు విముక్తి కల్పించి, ప్రభుత్వ భూముల జాబితా నుంచి తొలగించారు. దీని ద్వారా ఇబ్రహీంపట్నం మండలంలో 19 ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీల్లో 1250 మంది లబ్ధిదారులకు పట్టాలతో పాటు భూముల వివరాలు ఆన్‌లైన్ చేశారు. మరో 4 సొసైటీల సభ్యులు కోర్టు వివాదాలు, తదితర కారణాలతో పట్టాలు పొందలేదు. గత ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూములను ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చింది. తరతరాలుగా సాగు చేసుకుని జీవిస్తున్న పేదల రైతుల పొట్టకొట్టేందుకు కూటమి ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తోంది.

రైతులకు తెలియకుండానే సాయిల్ టెస్ట్

లంక భూముల సమీకరణకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించిన మరుసటి రోజు నుంచే చెన్నై టీమ్, రెవెన్యూ సిబ్బంది రెండు విడతలుగా డ్రోన్ సర్వే చేపట్టారు. సీఆర్డీఏ సిబ్బంది చినలంక భూముల్లో సాయిల్ టెస్ట్ కూడా నిర్వహించారు. తమకు తెలియకుండా తమ పొలాల్లో సాయిల్ టెస్ట్ చేయడం ఏమిటని రైతులు ప్రశ్నించారు. ఇప్పటి వరకు సాగుచేసుకున్నది చాలు, ఇక నుంచి ఇవి ప్రభుత్వ భూములు. మీకు ఎటువంటి హక్కులు లేవు అని వారు సమాధానం చెప్పడంతో రైతులు కంగుతిన్నారు.

ఏడాదికి మూడు పంటలు పండే భూములు

జరీబ్ భూములుగా ఉన్న లంక పొలాల్లో సన్నచిన్నకారు రైతులు ఏడాదిలో మూడు పంటలు పండిస్తారు. 40 ఏళ్లుగా పొలాల్లో విద్యుత్ సదుపాయం, మోటార్లు ఏర్పాటు చేసుకుని వ్యవసాయం చేస్తున్నారు. లంకల్లో ఎక్కువగా మినుము, మొక్కజొన్న, నువ్వులు, చెరకు, పసుపు, ఉద్యాన పంటలైన బొప్పాయి, మునగ, జామ, నిమ్మ, మామిడి. అరటి, ఇతర కూరగాయ పంటలు పండించి కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వారి భూములు లాక్కుంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారనుంది.

ప్రభుత్వం జీవనోపాధి చూపాలి



తాతల కాలం నుంచి వచ్చిన లంక భూములు సాగు చేసుకుని జీవిస్తున్నాం. ఇప్పుడు అర్థాంతరంగా ప్రభుత్వం తీసుకుంటే మా గతేం కాను. ప్రభుత్వం తప్పనిసరై తీసుకుంటే ప్రత్యామ్నాయం చూపాలి. రాజధాని అమరావతిలో మాదిరిగా ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి.

– మందా సుధాకర్, ఆదిఆంధ్ర ఫీల్డ్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యుడు

పోరాటాలతో సాధించుకున్న భూములు



పూర్వం భూస్వాముల చేతుల్లో ఉన్న లంక భూములను కమ్యూనిస్ట్ పార్టీ ఎన్నో పోరాటాలు చేసి పేదలకు అందించింది. తరతరాలుగా పేదలు సాగు చేసుకుంటున్న భూముల్ని ప్రభుత్వం లాగేసుకోవడం అన్యాయం. భూములు తీసుకుంటే పేదలకు నెల వారీగా భృతి కల్పించాలి.

– ఎం.యలమందరావు, రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు, కొటికలపూడి

బాబూ.. రాష్ట్రాన్ని ఏం చేయదలచుకున్నావ్..?

- అదనంగా 44 వేల ఎకరాలు దేనికోసం?
- రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ చేస్తారా?
- సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ధ్వజం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రాన్ని ఏం చేయదలచుకున్నావ్ బాబూ.. అంటూ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు సీఎం చంద్రబాబు తీరుపై ధ్వజమెత్తారు. రాజధాని నిర్మాణం పేరుతో ఇప్పటికే 58వేల ఎకరాలు సేకరించారని, మరలా 44వేల ఎకరాలు దేనికోసమంటూ నిలదీశారు. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం వడ్డే శోభనాద్రీశ్వరరావు మీడియాతో మాట్లాడారు. మళ్లీ పాత పద్ధతిలో వెళ్లొద్దంటూ చంద్రబాబుకు హితవు పలికారు. రైతులకు, రాష్ట్ర ప్రజలకు ఏం కావాలో వాటిని చేయాలని సూచించారు. సెక్రటేరియట్, హైకోర్టు, అసెంబ్లీ, పరిపాలనా వ్యవస్థలన్నింటికీ కావాల్సింది కేవలం 2700 ఎకరాలు మాత్రమేనన్నారు. తాత్కాలికం పేరుతో సెక్రటేరియట్, హైకోర్టు, అసెంబ్లీ భవనాలను నిర్మించారని, ఇప్పుడు అదనంగా మరో 44వేల ఎకరాలు తీసుకుంటామని ప్రకటించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ''రాజధాని కోసం రూ.31 వేల కోట్లు అప్పుచేశారు... ఇంకా రూ.69 వేల కోట్లు అవసరమంటున్నారు. ఇలాంటి ఆలోచనలతో ఈ రాష్ట్రాన్ని ఏం చేయాలనుకుంటున్నారో చెప్పాలి'' అని వడ్డే ప్రశ్నించారు. ప్రజలకు ఉపయోగపడేవి వదిలేసి అవుటర్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు అంటారేంటి చంద్రబాబు అని నిలదీశారు. హైపర్ లూప్ అనే రైలు అమెరికా, జపాన్, జర్మనీ వంటి దేశాల్లోనే లేదని, ఏపీలో హైపర్ లూప్ రైలుకు డీపీఆర్ సిద్ధం చేయాలని చెప్పడం చంద్రబాబు అనాలోచిత...తొందరపాటు చర్యకు నిదర్శనమని విమర్శించారు. రాజధానిలో 40 అంతస్తుల భవనాలతో ప్రజలకు ఒరిగేదేమిటని, ప్రజలకు కావాల్సింది ఎత్తైన భవనాలు కాదు.. మంచి పరిపాలన అని అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 6 ఎయిర్ పోర్టులు ఉన్నాయని, అవి సరిపోనట్లు మరో 8 ఎయిర్‌పోర్టులు నిర్మించాలని చెప్పడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. పీ 4 సంగతి సరే... ముందు సూపర్ సిక్స్ హామీలపై మాట్లాడాలన్నారు. చంద్రబాబు ఇప్పటికైనా ఆలోచనా విధానం మార్చుకోవాలని హితవు పలికారు.

కృష్ణాజిల్లాలో పనిచేయటం నా అదృష్టం

వీడ్కోలు సభలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణాజిల్లా న్యాయ వ్యవస్థలో పనిచేయటం తన అదృష్టంగా భావిస్తున్నానని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక అన్నారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయమూర్తుల బదిలీల సందర్భంగా మంగళవారం వారికి వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సభలో ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక మాట్లాడుతూ ఎంతో పురాతనమైన మచిలీపట్నం బార్ అసోసియేషన్‌తో అనుసంధానమైన కృష్ణాజిల్లా కోర్టులో ఎంతో అనుభవం కలిగిన న్యాయవాదులతో మూడు సంవత్సరాలు పనిచేయటం ఆనందంగా ఉందన్నారు. తన సర్వీసులో మచిలీపట్నంలో చేసిన



జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారికను సన్మానిస్తున్న న్యాయవాదులు

పదవీకాలం తీపి గుర్తుగా మిగిలిపోతుందన్నారు. ఎక్కువ కేసుల పరిష్కారం కోసం కృషి చేసిన అందరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మొదటి అదనపు జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు మాట్లాడుతూ కృష్ణాజిల్లాకు తనకు ఎక్కువ అనుబంధం ఉందని 27 సంవత్సరాల సర్వీసులో 14 సంవత్సరాలు కృష్ణాజిల్లాలోనే వివిధ హోదాల్లో న్యాయమూర్తిగా పనిచేశానన్నారు. పదో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.చినబాబు మాట్లాడుతూ సత్వర కేసుల పరిష్కారం కోసం అందరూ కృషి చేయాలన్నారు. మచిలీపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో న్యాయమూర్తులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

అరుణసారికను కలిసిన కలెక్టర్ బాలాజీ

ఇటీవల బదిలీ అయిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారికను మంగళవారం ఆమె చాంబర్‌లో కలెక్టర్ బాలాజీ మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపికను అందజేశారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

- నేటి నుంచి కాలువలకు నీటిని వదిలే అవకాశం
- సమ్మర్ స్టోరేజీ చెరువులను పూర్తిగా నింపుకోవాలి
- అధికారులకు కృష్ణా కలెక్టర్ బాలాజీ ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): ఈ వేసవిలో జిల్లాలో తాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జలవనరులు, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించి సమీక్ష చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీ నుంచి ప్రకాశం బ్యారేజీ ద్వారా కాలువలకు నీటిని వదిలే అవకాశం ఉందని, జిల్లాలోని 266 సమ్మర్ స్టోరేజీ చెరువులను పూర్తిగా నింపాలన్నారు. చేపల చెరువులకు నీరు పోకుండా ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, జలవనరులు, మత్స్యశాఖ అధికారుల సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. నగరంలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంకులన్నీ పూర్తిగా నింపుకోవాలన్నారు. జిల్లాలోని ఏ చెరువులో ఏ తేదీన నీటితో నింపారు, నిల్వ సామర్థ్యం, ఆ నీరు ఎన్ని రోజులకు సరిపోతాయన్న వివరాలను అందజేయాలన్నారు. ఏ చెరువులో పూడికలు తొలగించాలో తెలియజేస్తే ఉపాధి హామీ పథకం ద్వారా పూడికల తొలగింపు కార్యక్రమం చేపడతామన్నారు. సమావేశంలో జలవనరుల శాఖ ఎస్ఈ మోహనరావు, ఈఈలు ఆంజనేయప్రసాద్, రవికిరణ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నటరాజ్, డీపీవో జె.అరుణ, మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, గోపాలరావు, శ్రీనివాసరావు, భవానీప్రసాద్ పాల్గొన్నారు.

పరిమళిస్తున్న పసుపు

చిగురిస్తున్న రైతుల ఆశలు

- క్రమంగా పెరుగుతున్న పచ్చబంగారం (పసుపు) ధరలు
- క్వింటా పసుపు కొమ్ములు (ఎండువి) రూ.12 వేలు
- నెలాఖరుకు ఇంకా ధరలు పెరుగుతాయని రైతుల ఆశ

కంకిపాడు: పచ్చ బంగారం (పసుపు) రైతుల ఆశలు చిగురిస్తున్నాయి. క్రమక్రమంగా పసుపు కొమ్ముల ధరలు పెరుగుతుండటంతో అన్నదాతల మోములో చిరునవ్వులు చిందుతున్నాయి. నెలాఖరుకు ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందన్న సమాచారంతో పసుపు రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. పసుపు కొమ్ములు ఉడికించి ఎండబెట్టి పంట నాణ్యంగా ఉండేలా రైతులు సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. కృష్ణాజిల్లాలో 5031 ఎకరాల్లోనూ, ఎన్టీఆర్ జిల్లాలో 707 ఎకరాల్లో పసుపు సాగు చేశారు. ఎకరాకు కౌలు మూడు పుట్లు (పుట్టు అంటే 225 కిలోలు) చొప్పున ఒప్పందం చేసుకుని సాగు చేశారు. ఎకరాకు రూ.1.70 లక్షల వరకూ పెట్టుబడులు పెట్టారు. ఎకరాకు 60–70 పుట్లు పచ్చి పసుపు కొమ్ములు దిగుబడిగా లభించాయి. కొమ్ములు ఉడికించిన అనంతరం 22–25 క్వింటాళ్ల వరకూ ఎండు కొమ్ములు దిగుబడులుగా వస్తాయని రైతులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది మాత్రం పంట చేతికొచ్చే నాటికి రూ.9100 మాత్రమే పలికింది. ప్రస్తుతం క్వింటా ధర రూ.12 వేలు మార్కు దాటిందిజ నెలాఖరు నాటికి మరో వెయ్యి వరకూ పెరిగే అవకాశం ఉందని రైతులు ఆశతో ఉన్నారు. దీంతో కొమ్ములు ఎండగట్టి భద్రంగా నిల్వ చేసి మంచి ధర రాగానే విక్రయించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని 24న ధర్నా

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఎన్టీఆర్ జిల్లాలో గత ఏడాది ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 24న ఆందోళన నిర్వహించనున్నట్లు ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎ.సుందరయ్య, సెక్రటరీ జనరల్ డాక్టర్ ఇంటి రాజు తెలిపారు. ఈ మేరకు వారు ఉపాధ్యాయ సంఘాల నేతలతో కలిసి మంగళవారం డీఆర్వో లక్ష్మీనరసింహంను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందించారు.

క్లుప్తంగా

ఆగిన వేట.. నిలిచిన పడవలు



కోడూరు: ఫిషరీస్ అధికారులు, మెరైన్ పోలీసుల ఆదేశాలతో తీరప్రాంత గంగపుత్రులు మంగళవారం నుంచి వేట విరామం అమలు చేశారు. కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ పరిధిలోని ప్రతి మత్స్యకార కుటుంబానికి అధికారులు నోటీసులను జారీ చేయడంతో గంగపుత్రులు తమ పడవలు, వలలను ఒడ్డుకు చేర్చుకున్నారు. జూన్ 14 వరకు వేట నిషేధాజ్ఞలు ఉంటాయి. వేట విరామంతో తమకు ఉపాధి ఉండదని మత్స్యకారులు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం గత ఏడాది కూడా మత్స్యకార భృతి ఇవ్వలేదని, ఈ సంవత్సరమైనా ఇచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు. ప్రస్తుతం మత్స్యకారులంతా తమ గ్రామాల్లోని తుపాను షల్టర్ల వద్ద వలలను భద్రపర్చుకుని, వాటికి మరమ్మతులు చేపట్టారు.

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

చిలకలపూడి(మచిలీపట్నం): రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించాలని సంబంధిత అధికారులను కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో రెవెన్యూ అధికారులతో రెవెన్యూ సమస్యలపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ.. రెవెన్యూ సమస్యలను పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని కోరారు. భూముల అలినేషన్, 22ఏలో ఉన్న ప్రైవేటు, ఎసైన్‌మెంట్, ఇనాం, ఆర్‌ఓఆర్ వెబ్‌ల్యాండ్ భూములు, రీ-సర్వే, నీటి పన్ను తీరువా తదితర రెవెన్యూ అంశాలపై అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికలో రెవెన్యూ సమస్యలపై ఎక్కువగా అర్జీలు వస్తున్నాయని, వాటిని స్థానిక అధికారుల స్థాయిలోనే పరిష్కారం చూపితే జిల్లా అధికారుల వద్దకు బాధితులు రారని పేర్కొన్నారు. ఈ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలిశర్మ, డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఆర్డీఓలు కె.స్వాతి, జి.బాలసుబ్రహ్మణ్యం, కై లా షారోన్, కలెక్టరేట్ ఏఓ వీరాంజనేయప్రసాద్, పలువురు తహసీల్దార్లు, డెప్యూటీ తహసీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ
చిత్రంలో జేసీ గీతాంజలిశర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు

పన్ను చెల్లించని వారిని గుర్తించండి

చిలకలపూడి(మచిలీపట్నం): కృష్ణా జిల్లాలో పన్ను చెల్లించకుండా వ్యాపారం చేస్తున్న వారిని గుర్తించి పన్ను చెల్లింపు పరిధిలోకి తీసుకురావాలని అధికారులను కలెక్టర్ డి.కె.బాలాజీ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం తన చాంబర్‌లో వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో పలువురు వ్యాపారులు పన్ను చెల్లించకుండా అక్రమ మార్గంలో వ్యాపారాలు చేస్తున్నారని పేర్కొన్నారు. జీఎస్టీ నంబరు తీసుకుని ప్రతి సంవత్సరం ఎంత వ్యాపారం చేస్తున్నారో కచ్చితమైన లెక్కలు చూపకుండా, పన్ను చెల్లించకుండా ఉన్న వారిని గుర్తించి పన్ను చెల్లింపు పరిధిలోకి తీసుకురావాలన్నారు. రూ.40 లక్షలకు పైగా జరిగిన లావాదేవీలను గుర్తించేందుకు బ్యాంకుల సహకారం తీసుకుని తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో వాణిజ్య పన్నుల శాఖ విజయవాడ డివిజన్ డెప్యూటీ కమిషనర్ కె.పి. శైలజ, అసిస్టెంట్ కమిషనర్లు చిరంజీవి, రాజ్‌కుమార్, వి.వెంకటేశ్వరరావు, తిరుమలయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న
వాణిజ్య పన్నులశాఖ అధికారులు

పది నెలల నుంచి దోచుకో.. దాచుకో పాలన

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: పది నెలల కూటమి పాలనలో అవనిగడ్డ ఎమ్మెల్యే తీరు దోచుకో.. దాచుకో అన్న చందంగా ఉందని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి నియోజకవర్గంలో ఇసుక, బుసక, మద్యం అక్రమ దందాతో పాటు చివరికి పేదలకు ఇచ్చే రేషన్ బియ్యాన్ని కూడా వదలకుండా ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు దోచుకుంటున్నారని విమర్శించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎవరో తెలియని పరిస్థితి నెల కొందని ఎద్దేవాచేశారు. ఎమ్మెల్యే కుమారుడు, అల్లుడు తామే ఎమ్మెల్యేలం అన్న రీతిలో వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఎమ్మెల్యేల్లో అవనిగడ్డ ఎమ్మెల్యే రాష్ట్రంలోనే మొదటి స్థానానికి చేరారని పేర్కొన్నారు. పండించిన పంటను కొనే నాథుడు లేక, సరైన గిట్టుబాటు అందక రైతుల తీవ్ర ఇబ్బందులు పడుతుంటే స్థానిక ఎమ్మెల్యేకు చీమకుట్టినట్టయినా లేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన రహదారులను వారి ఘనతగా చెప్పుకుంటున్నారని ఎద్దేవాచేశారు. గతంలోనే నిధులు మంజూరైనా కొన్ని రహదారులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న కాలంలో ప్రజలు రోడ్ల పైకొచ్చి తిరగబడతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నాయకులు సింహాద్రి వెంకటేశ్వరరావు, గుర్రం బసవయ్య, రేపల్లె శ్రీనివాసరావు, గాజుల జయగోపాల్, నలుకుర్తి పృథ్వీరాజ్, సైకం బాబూరావు, షేక్ నజీర్‌బాషా, చింతలపూడి బాలభాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న
మాజీ ఎమ్మెల్యే సింహాద్రి

మరణంలోనూ వీడని రక్త సంబంధం

తమ్ముడి మృతిని తట్టుకోలేక ప్రాణాలొదిలిన అక్క

గుడివాడరూరల్: తమ్ముడు మృతి చెందాడనే వార్త విని అక్క పరుగున ఆస్పత్రికి వచ్చారు. విగతజీవిగా పడి వున్న తమ్ముడిని చూసి తట్టుకోలేక ఆమె గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటన గుడివాడ మండలంలో విషాదం నింపింది. మండలంలోని దొండపాడు గ్రామానికి చెందిన గద్దే వెంకట రామాంజనేయులు (రాము) (53) అనారోగ్యానికి గురై కొద్ది రోజులుగా విజయవాడలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో ఆయన మంగళవారం మృతిచెందారు. ఆయనకు నలుగురు అక్కలు. రాము అందరిలో చిన్న కావడంతో అక్కలు ఎంతో ప్రేమగా చూసుకునేవారు. పెద్ద అక్క ముక్తినేని అంజలి(65) గుడివాడ రాజేంద్రనగరలో నివసిస్తున్నారు. తమ్ముడి మృతివార్త విన్న ఆమె హుటాహుటిన విజయవాడ ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడ తమ్ముడి మృతదేహాన్ని చూసి తట్టుకోలేక భోరు విలపించారు. ఈ క్రమంలో గుండెపోటుకు గురైన అంజలి అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. వైఎస్సార్ సీపీ దొండపాడు గ్రామ అధ్యక్షుడి బాధ్యతలు చూస్తున్న రామాంజనేయులు గతంలో సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి కృషి చేశారు. ఆయన భార్య పుష్పరాణి ప్రస్తుతం ఎంపీపీగా కొనసాగుతున్నారు.



రామాంజనేయులు (ఫైల్)



అంజలి (ఫైల్)

బాలుడిని చిదిమేసిన ట్రాక్టర్

నిమ్మగడ్డ(చల్లపల్లి): ఆడుతూ పాడుతూ కేరింతలు కొట్టిన బాలుడి దృశ్యాలు తల్లిదండ్రుల మదిని వీడ లేదు.. అమ్మా.. ఆడుకోవడానికి వెళ్తున్నా అంటూ ఆ చిన్నారి చెప్పిన మాటలు తల్లి చెవిని వీడలేదు. ఇంటి నుంచి నవ్వుతూ వెళ్లిన బాలుడిని నిమిషాల వ్యవధిలోనే మృత్యువు ట్రాక్టర్ రూపంలో బలిగొంది. ఈ దుర్ఘటన చల్లపల్లి మండలం నిమ్మగడ్డ గ్రామంలో జరిగింది. నిమ్మగడ్డకు చెందిన బడుగు నాగబాబుకు కుమారుడు గౌతం హర్ష(8), కుమార్తె ఉన్నారు. మంగళవారం సాయంత్రం సమయంలో గౌతం హర్ష తన స్నేహితులతో కలిసి ఆడుకునేందుకు ఇంటికి కొంత దూరంలో ఉన్న పులిగడ్డ-విజయవాడ కరకట్ట దిగువన ఉన్న ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ ఓ ట్రాక్టర్ ఆగి ఉంది. పిల్లలు ఆడుకొంటుండగా ఓ బాలుడు ట్రాక్టర్‌కు ఉన్న తాళం తిప్పాడు. బండి గేరులో ఉండటంతో ట్రాక్టర్ స్టార్ట్ అయ్యి ఒక్కసారిగా ముందుకు దూకింది. అక్కడే ఆడుకుంటున్న గౌతం హర్ష తలకు ట్రాక్టర్ తగలటంతో తీవ్రగాయమైంది. బాలుడిని హుటాహుటిన చల్లపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే హర్ష మృతి చెందినట్లు చెప్పటంతో అందరూ ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగిపోయారు. కళ్ల ముందే కేరింతలు కొట్టిన తమ బిడ్డ హర్ష కానరాని లోకాలకు వెళ్లిపోయాడంటూ తల్లిదండ్రుల కన్నీరు మున్నీరుగా విలపించారు.



ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్



గౌతం హర్ష మృతదేహం

చెరువులో పడి వ్యవసాయ కూలీ దుర్మరణం

పామర్రు: మండలంలోని జురువరంలో చెరువులో పడి వ్యవసాయ కూలీ దుర్మరణం పాలైన ఘటన మంగళవారం జరిగింది. జురువరం గ్రామానికి చెందిన ధనికొండ నాంచారయ్య(60) గ్రామంలోని మంచినీటి చెరువులో ప్రమాదవశాస్తు కాలుజారి పడిపోయాడు. చెరువులో లోతు ఎక్కువగా ఉండటం నీట మునిగాడు. నీటిలో కొట్టుకుటున్న నాంచారయ్యను స్థానికులు గుర్తించి హుటాహుటిన ఒడ్డుకు చేర్చారు. 108 అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించేందుకు ప్రయత్నించారు. అంతలోనే నాంచారయ్య మృతిచెందాడు.



రైతుల నుంచి దాళ్వా ధాన్యం సేకరిస్తాం

డీఎం పద్మాదేవి

పెనమలూరు: కృష్ణా జిల్లాలో రైతుల నుంచి దాళ్వా ధాన్యం సేకరించి గిట్టుబాటు ధర చెల్లిస్తామని జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ పద్మాదేవి తెలిపారు. ఆమె మంగళవారం వణుకూరు గ్రామంలో ధాన్యం సేకరణ తీరును పరిశీలించి, మొదటి ధాన్యం లోడును జెండే ఊపి మిల్లుకు తరలించారు. ఈ సందర్భంగా పద్మాదేవి మాట్లాడుతూ.. పెనమలూరు మండలంలో ఏడు రైతు సేవా కేంద్రాల నుంచి ధాన్యం సేకరణ చేస్తామన్నారు. మండలంలో దాదాపు 2,700 ఎకరాల్లో దాళ్వా వరి సాగైందని, పది వేల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశామని పేర్కొన్నారు. రైతులు ఎంటీయూ 1153, 1121 వంగడాలను సాగు చేశారని వివరించారు. ఎకరాకు 40 నుంచి 45 బస్తాల సగటు దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకుంటే సకాలంలో ట్రిప్ షీటు ఇస్తామని, ధాన్యం మిల్లులకు తరలిస్తామని తెలిపారు. జిల్లాలో అన్ని మండలాల్లో ధాన్యం సేకరణ చేపడతామన్నారు. రైతులకు సమస్యలు తలెత్తితే వెంటనే ఆయా ప్రాంతాల్లో ఉన్న రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారుల దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



రైతులతో మాట్లాడుతున్న డీఎం పద్మాదేవి

క్రీడాకారులను అభినందించిన మంత్రి



క్రీడాకారులను అభినందిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

గుడివాడ టౌన్: ఢిల్లీలోని వినయ్ మార్గ్ స్పోర్ట్స్ స్టేడియంలో గత నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఖోఖో టోర్నమెంట్‌లో విజయం సాధించి కాంస్య పతకం పొందిన క్రీడాకారులను రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి మంగళవారం అభినందించారు. విజయం సాధించిన క్రీడాకారులు మంత్రిని ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రం తరఫున క్రీడల్లో విజయం సాధించడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులు కోరిన స్పెషల్ ఇంక్రిమెంట్ ఇచ్చేందుకు కృషిచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుడివాడ క్రీడాకారులు, కోచ్ మడకా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వంశీ బెయిల్

పిటిషన్‌పై విచారణ వాయిదా

గన్నవరం: సత్యవర్ధన్ కేసులో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ ఈ నెల 17వ తేదీకి వాయిదా పడింది. ఇప్పటికే ఈ కేసులో వంశీమోహన్ అరెస్ట్ అయ్యి విజయవాడ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ విజయవాడలోని ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో మంగళవారం విచారణకు వచ్చింది. వంశీమోహన్‌కు బెయిల్ ఇవ్వవద్దని పటమట పోలీసులు కౌంటర్ దాఖలు చేశారు. ఈ కేసులో చార్జిషీట్ దాఖలకు సమయం ఈ నెల 13వ తేదీతో ముగియడంతో మరో 30 రోజుల గడువు కోరుతూ పోలీసులు మెమో దాఖలు చేశారు. ఈ కేసులో మరికొంత మంది నిందితులను అరెస్ట్ చేయాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు. పోలీసుల వాదనపై వంశీమోహన్ తరఫున న్యాయవాది దేవి సత్యశ్రీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసులో విచారణ గడువు 60 రోజులు పూర్తయిన సందర్భంగా వంశీమోహన్‌కు బెయిల్ మంజూరు చేయాలని గట్టిగా వాదించారు. అనంతరం విచారణను జడ్జి హిమబిందు ఈ నెల 17వ తేదీకి వాయిదా వేశారు.